


### చీనీ టన్ను రూ.30 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.30 వేలు పలికాయి.



### టమాట కిలో రూ.9

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.9 పలికింది. కనిష్టం రూ.5, సరాసరి రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.6°/09.4°

జిల్లా అంతటా శనివారం చలి వాతావరణం నెలకొంది. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

## న్యూస్‌రీల్

### 10,18న జాబ్‌మేళా



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

**అనంతపురం:** ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఈ నెలలో నిర్వహించనున్న జాబ్‌మేళాల షెడ్యూల్ ఖరారు చేశారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ వినోద్‌కుమార్ శనివారం ఆవిష్కరించారు. ఈ నెల 10న రాయదుర్గం కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు నార్పల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో, 18న ఆర్ట్స్ కళాశాల (రాప్తాడు నియోజకవర్గం వారికి), కళ్యాణదుర్గం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తారు. యువత 83175 20929, 08554-281026 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు. naipunyam.ap.gov.inలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

### పింఛన్ల ఏరివేతకు చర్యలు

**అనంతపురం అర్బన్:** అనర్హ పింఛన్ల ఏరివేతకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు పరిశీలన ప్రక్రియ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ప్రతి నెలా 2,499 మంది అనారోగ్య పింఛన్లు తీసుకుంటున్నారన్నారు. అంగవైకల్యం, వివిధ రకాల వ్యాధులకు గురై పింఛను పొందుతున్న వారి అర్హతపై మరో విడత ప్రభుత్వ వైద్యుల ద్వారా పరిశీలన చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. జిల్లా స్థాయి కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో వైద్య బృందం ప్రతి ఇంటికీ వెళ్లి పరిశీలిస్తుందన్నారు. అధికారులు నిర్దేశించిన తేదీల్లో ఇంటి వద్దనే ఉండి ఆరోగ్య బృందానికి సహకరించాలని, లేని పక్షంలో పింఛను నిలిపివేస్తారని హెచ్చరించారు. సమాచారం కోసం సంబంధిత ఎంపీడీఓ, మునిసిపల్ కమిషనర్‌ను సంప్రదించాలని సూచించారు.

### చీటీల పేరుతో కుచ్చుటోపీ

- రూ. 2 కోట్లతో ఉడాయించిన మహిళ

**గుత్తి:** చీటీల పేరుతో కుచ్చుటోపీ పెట్టిన ఉదంతమిది. మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ఎస్ పల్లిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు.. ఎస్ఎస్ పల్లికి చెందిన అంజలి చాలా రోజులుగా చీటీలు వేస్తోంది. ఎర్రిస్వామి, శేషు, వెంకట సుబ్బయ్య, సూరి, కంబగిరి, ప్రభావతి, రామలక్ష్మమ్మ, మాణిక్యమ్మ, అంకాలమ్మతో పాటు సుమారు 100 మంది ఈమెతో చీటీలు కట్టారు. దీంతో పాటు కొంత నగదును వడ్డీకి ఇచ్చారు. ఈ క్రమంలోనే సుమారు రూ. 2 కోట్ల చీటీ డబ్బుతో అంజలి ఉడాయించింది. శనివారం రాత్రి అంజలి ఇంట్లోని సామాన్లను ఆమె తల్లి తీసుకెళుతుండగా బాధితులు అడ్డుకున్నారు. నెల క్రితమే అంజలి ఎక్కడికో వెళ్లిపోయిందని తెలుసుకున్నారు. అనంతరం స్థానిక పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# కష్టాలు దాటి.. శిఖరాలకు

ప్రతిభకు పేదరికం అడ్డు రాదు. పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదు... ఈ విషయం అక్షర సత్యమని నిరూపించింది ఆత్మకూరుకు చెందిన మందల అనూష. పేద కుటుంబంలో పుట్టినా కష్టంతో శిఖరమంత ఎత్తుకు చేరి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. రాష్ట్రం నుంచి భారత మహిళా ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైన మొదటి క్రీడాకారిణిగా నిలిచి జిల్లాతో పాటు రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేసింది.



- మందల అనూష

Sunday Special



దేశంలోని వివిధ క్లబ్బుల క్రీడాకారులు, కప్పులతో అనూష (ఫైల్)

- ఫుట్‌బాల్‌లో సత్తా చాటుతున్న అనూష
- ఏకంగా జాతీయ జట్టుకు ఎంపిక
- రాష్ట్రం నుంచి మొదటి క్రీడాకారిణిగా ఘనత
- సోదరీమణుల స్ఫూర్తి, ఆర్డీటీ సహకారంతో రాణింపు

**ఆత్మకూరు:** మండలకేంద్రానికి చెందిన ఇంటర్ విద్యార్థిని అనూష ఫుట్‌బాల్‌లో విశేషంగా రాణిస్తోంది. ఈమె తల్లిదండ్రులు రామలక్ష్మి, చంద్రలకు సొంతంగా సెంటు స్థలం కూడా లేదు. వ్యవసాయ పనులు, బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అరకొర సంపాదనతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు సంతానం కాగా, అనూష మూడో కుమార్తె. మొదటి, రెండో సంతానమైన చందన, రాజేశ్వరి కూడా ఫుట్‌బాల్ బాగా ఆడేవారు. తాము చదువుకునే రోజుల్లో జాతీయ స్థాయిలో ఆడి ప్రతిభ చాటారు. అయితే, ఆర్థిక స్తోమత లేక తల్లిదండ్రులు పెళ్లిళ్లు చేసేయడంతో ఆటను వదిలి పెట్టాల్సి వచ్చింది.



మాంఛో ఫెర్రర్‌తో అనూష

**అక్కలను ఆదర్శంగా తీసుకొని..**

తన ఇద్దరు అక్కలను ఆదర్శంగా తీసుకున్న అనూష చిన్నప్పటి నుంచే ఫుట్‌బాల్‌పై దృష్టి సారించింది. క్రమం తప్పకుండా ఆర్డీటీ క్రీడా మైదానానికి వెళ్లేది. ఈ క్రమంలో 2017లో జరిగిన మిక్స్‌డ్ జెండర్ ఫుట్‌బాల్ పోటీల్లో సత్తా చాటి అందరి దృష్టిని ఆకర్షించింది. అనూష ఆటకు ముగ్ధులైన నిర్వాహకులు బెస్ట్ ప్లేయర్ అవార్డు అందించారు. ఆ తర్వాత జరిగిన ప్రతి మ్యాచ్‌లోనూ రాణించడంతో ఆర్డీటీ స్పోర్ట్స్ అకాడమీకి ఎంపిక చేశారు. అప్పటి నుంచి అనూష చదువుతో పాటు క్రీడా శిక్షణ ఖర్చులు ఆర్డీటీ వారే భరిస్తున్నారు. కోచ్‌ల శిక్షణలో రాటుదేలిన అనూష 2022లో రూట్ క్లబ్ తరఫున, 2024లో కెంప్ ఫుట్‌బాల్ క్లబ్ తరఫున బెంగళూరు, ముంబై, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో జరిగిన మ్యాచుల్లో ఆడింది. ఈ క్రమంలోనే రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికై జమ్మూకశ్మీర్, హర్యానాలో జరిగిన పోటీల్లో పాల్గొంది. రెండు నెలల క్రితం అనంతపురంలో జరిగిన జూనియర్ నేషనల్ ఫుట్‌బాల్ టోర్నీలో సత్తా చాటడంతో నిర్వాహకులు అండర్-20 కేటగిరీలో భారత మహిళల ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక చేశారు.

**తల్లిదండ్రుల కష్టాలు దూరం చేస్తా..**

నా తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటూనే ముగ్గురు పిల్లల్ని చదివించారు. మా అక్కలు కూడా ఫుట్‌బాల్‌లో జాతీయ స్థాయిలో ఆడి మంచి ప్రతిభ కనబరిచారు. కానీ, ఆర్థిక పరిస్థితుల వల్ల మధ్యలోనే ఆపేశారు. అమ్మానాన్నల కష్టాలను దూరం చేయడమే నా లక్ష్యం. ఆర్డీటీ వారి సహకారం మరువలేనిది.

– అనూష, ఫుట్‌బాల్ క్రీడాకారిణి

**గర్వంగా ఉంది..**

రెక్కల కష్టంతో పిల్లల్ని పోషించుకుంటున్నాం. మా బిడ్డ దేశం తరఫున ఆడుతోందంటే చాలా గర్వంగా ఉంది. ఆర్డీటీ లేకపోతే అనూష ముందుకు వచ్చేది కాదు. మేం పడుతున్న కష్టాలు పిల్లలకు రాకూడదనేదే మా ఆకాంక్ష. భవిష్యత్తులో జరిగే మ్యాచ్‌లలోనూ అనూష రాణించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నాం.

– రామలక్ష్మి, చంద్ర

**మొట్టమొదటి క్రీడాకారిణిగా ఘనత**

గతంలో రాష్ట్రం నుంచి ఎవరూ జాతీయ ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక కాలేదు. ఆ లోటును భర్తీ చేస్తూ అనూష కొత్త చరిత్రను లిఖించింది. ఇటీవల బెంగళూరు వేదికగా నిర్వహించిన ఇండియా, మాల్దీవుల ఫ్రెండ్లీ మ్యాచ్‌లలో ప్రాతినిధ్యం వహించింది. ఈ రెండు మ్యాచుల్లోనూ భారత జట్టు గెలుపొందడం గమనార్హం. పేద కుటుంబంలో పుట్టినా వెరవకుండా అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన అనూషపై ఆత్మకూరువాసులు ప్రశంసలు కురిపిస్తున్నారు. దేశం తరఫున రాణించి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నారు.



ఆత్మకూరులోని తమ ఇంటి వద్ద అనూష తల్లిదండ్రులు

### వణికిపోతున్నారు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు భారీగా పతనం



**అనంతపురం అగ్రికల్చర్:** ఉమ్మడి జిల్లా గజగజ వణుకుతోంది. రాత్రి ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మడకశిరతో పాటు హిందూపురం, కదిరి, కళ్యాణదుర్గం, రాయదుర్గం, రాప్తాడు, పెనుకొండ, ఉరవకొండ నియోజకవర్గాల్లో చలి ప్రభావం తీవ్ర స్థాయిలో ఉంది. శనివారం మడకశిరలో 7.7 డిగ్రీల కనిష్టం నమోదు కావడం చలితీవ్రతకు అద్దం పడుతోంది. ఉదయం 8 గంటల వరకు రహదారులను మంచుతెరలు కమ్మేస్తున్నాయి. రాత్రిళ్లు పొగమంచు ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు 27 నుంచి 33 డిగ్రీల మధ్య నమోదవుతుండగా కనిష్ట ఉష్ణోగ్రతలు 9 నుంచి 14 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. మడకశిర తర్వాత కుందుర్పిలో 9.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే, తనకల్లు 9.3 డిగ్రీలు, సోమందేపల్లి 9.6, నల్లమాడ 9.7, రొద్దం 9.9, బెళుగుప్ప 10, లేపాక్షి 10.1, నల్లచెరువు, చిలమత్తూరు 10.4, బుక్కపట్నం 10.5, వజ్రకరూరు, ఓడీ చెరువు 10.6, పరిగి 10.7, కనగానపల్లి 10.8 డిగ్రీలతో పాటు చాలా ప్రాంతాల్లో 11 డిగ్రీల లోపు కనిష్టం నమోదు కావడం గమనార్హం. చలి నుంచి రక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

**పెరగనున్న 'చలి'**

**బుక్కరాయసముద్రం:** జిల్లాలో రానున్న 5 రోజుల్లో రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గి చలి తీవ్రత పెరగనున్నట్లు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్ బాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్ష సూచన ఏమీ లేదన్నారు. పగటి ఉష్ణోగ్రతలు 30.5-31.0, రాత్రి ఉష్ణోగ్రతలు 16.0-17.4 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 78-89, మధ్యాహ్నం 30-40 శాతంగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

# రుణ లక్ష్యాలు పూర్తి చేయండి

- అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం

**అనంతపురం అర్బన్:** స్వయం ఉపాధి పథకం కింద బ్యాంకులకు కేటాయించిన రుణాల మంజూరు లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు 1,728 యూనిట్లు కేటాయించారన్నారు. రూ.2 లక్షల యూనిట్ విలువ ఉన్నవి 1,228 యూనిట్లు, రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల యూనిట్ విలువ కలిగినవి 368 యూనిట్లు, రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల యూనిట్ విలువ ఉన్నవి 132 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. కేటాయించిన లక్ష్యాలను ఆయా బ్యాంకులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈనెల 8వ తేదీ నుంచి 16వ తేదీ వరకు మీ-సేవ, సచివాలయాల్లో అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

**ఈబీసీ యువతకు జనరిక్ మెడికల్‌షాపు**

ఈబీసీ నిరుద్యోగ యువతకు జనరిక్ మెడికల్ షాపు ఏర్పాటుకు తోడ్పాటు అందిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాకు 72 జనరిక్ మెడికల్ షాపులు మంజూరయ్యాయని, యూనిట్ విలువ రూ.8 లక్షలు ఉంటుందని, సబ్సిడీ రూ.4 లక్షలు, బ్యాంకు రుణం రూ.4 లక్షలు ఇస్తామన్నారు. ఎల్‌డీఎం నర్సింగరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రమణ్యం, వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, మత్స్య శాఖ అధికారి శ్రీనివాసనాయక్, తదితరులున్నారు.

**మెనూ ప్రకారం భోజనం అందించాలి**

**శింగనమల:** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ వినోద్ కుమార్ అన్నారు. శనివారం నార్పలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకాన్ని' ఆయన ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న దాదాపు 11,244 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందన్నారు. హాజరు శాతం పెంచాలని అధ్యాపకులను ఆదేశించారు. కార్యక్రమంలో డీవైఈఓ వెంకటరమణ నాయక్, డీఎండబ్ల్యూఓ రామసుబ్బారెడ్డి, సర్పంచ్ సుప్రియ, తహసీల్దార్ అరుణకుమారి, ఎంఈఓ కృష్ణయ్య, కళాశాల ప్రిన్సిపాల్ బాలప్ప పాల్గొన్నారు.

# తెలుగు తమ్ముళ్లకు 'ఉపాధి'

- జాబ్‌కార్డుల యాక్టివ్ పేరిట కూలీల నుంచి డబ్బు వసూలు

**పామిడి:** సాంకేతిక సమస్యల వల్ల ఇన్‌యాక్టివ్ అయిన జాబ్‌కార్డులను యాక్టివ్‌గా మార్చే ప్రక్రియను అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన 'తమ్ముళ్లు' తమకు అనుకూలంగా మార్చుకున్నారు. రూ.500 చెల్లిస్తే యాక్టివ్ చేయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దందా పామిడి గ్రామపంచాయతీలో వెలుగు చూసింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) కింద కూలీలు వలస వెళ్లకుండా ఏడాదిలో వంద రోజులు పని కల్పిస్తారు. ఉన్న ఊరిలోనే పనులు చేసే అవకాశం ఉంటుంది. గ్రామపంచాయతీగా ఉన్న పామిడి 2012లో డీ-గ్రేడ్ మున్సిపాలిటీ (నగర పంచాయతీ)గా రూపాంతరం చెందింది. దీంతో పామిడితో పాటు పి.కొత్తపల్లి, పి.కొండాపురం గ్రామాల్లో అప్పటి వరకు జరుగుతున్న ఉపాధి హామీ పనులకు బ్రేక్ పడింది. ప్రజలు, ప్రజాప్రతినిధుల అభీష్టం మేరకు 2019 తర్వాత పామిడి తిరిగి గ్రామపంచాయతీగా డిమోట్ అయ్యింది. అప్పటి నుంచి ఉపాధి హామీ పనుల కల్పనను పునరుద్ధరించారు. అయితే పంచాయతీ పరిధిలోని 2,500 ఉపాధి హామీ జాబ్‌కార్డులు డీయాక్టివేట్‌లో ఉండిపోయాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. ఇంకేముంది అధికార 'తెలుగు తమ్ముళ్లు' జాబ్ కార్డుల యాక్టివేషన్‌ను తమకు అనుకూలంగా చేసుకున్నారు. తాము సిఫార్సు చేస్తేనే కార్డు యాక్టివేషన్ చేస్తారని చెప్పి ఒక్కొక్క కూలీ నుంచి రూ.500 రేటు ఫిక్స్ చేసి దందాకు తెరలేపారు. కూలి పనులపై ఆధారపడిన కూలీలు జాబ్‌కార్డులను యాక్టివేట్ చేసుకునేందుకు టీడీపీ వారు అడిగినంత సమర్పించుకోవాల్సి వస్తోంది. కష్టాన్ని నమ్ముకుని కుటుంబాన్ని పోషించుకునే తమలాంటి వారి నుంచి డబ్బు వసూలు చేయడం దారుణమని పేర్కొంటున్నారు.

# స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయండి

**అనంతపురం అర్బన్:** "గర్భస్థ పిండ లింగ నిర్ధారణ తీవ్ర నేరం. లింగ నిర్ధారణ చట్టం పకడ్బందీగా అమలవ్వాలి. స్కానింగ్ సెంటర్లల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి. చట్టాన్ని ఉల్లంఘించే వాటిపై కేసులు నమోదు చేయండి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం అమలుపై శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అదనపు జిల్లా జడ్జి శోభారాణితో కలిసి జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ చట్టంపై విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. స్కానింగ్ సెంటర్లు చట్ట పరిధిలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాలికల ప్రాముఖ్యత తెలిసేలా రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, సినిమా హాళ్లు, తదితర ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. అదనపు జిల్లా జడ్జి శోభారాణి మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలతో కలిసి మారుమూల గ్రామాలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ నుంచి సహకారం అందిస్తామని చెప్పారు. సమావేశంలో డీఎంహెచ్ఓ ఈబీదేవి, స్త్రీవ్యాధి నిపుణులు శంషాద్‌బేగం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 8న కేంద్ర బృందం పర్యటన

**అనంతపురం అగ్రికల్చర్:** గత ఖరీఫ్‌లో నెలకొన్న కరువు పరిస్థితుల పరిశీలనకు ఈనెల 8న అనంతపురం రూరల్, రాప్తాడు మండలాల్లో ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం (ఐఎంఎస్‌టీ) పర్యటించనున్నట్లు వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు రూరల్ మండలం మన్నీల, రాప్తాడు మండలంలో ఫొటో ఎగ్జిబిషన్, పంట పొలాల పరిశీలన, రైతులతో ముఖాముఖి కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో అనంతపురం, నార్పల, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, రాప్తాడు, యాడికి, విడపనకల్లు మండలాలను ప్రకటించింది. వ్యవసాయశాఖ అధికారులు ఇప్పటికే పంట నష్టం అంచనాలు పూర్తి చేశారు. ఒక్కో రైతుకు గరిష్టంగా రెండు హెక్టార్లకు పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్‌సబ్సిడీ) అందించాలని కేంద్ర బృందానికి నివేదికలు అందించనున్నారు. కాగా, గత రబీలో ప్రకటించిన కరువు మండలాలకు నిబంధనల మేరకు అందాల్సిన రూ.37 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## కాంట్రాక్టర్ ఆత్మహత్య



మృతుడు జనార్దన రెడ్డి

**అనంతపురం:** కాంట్రాక్టర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నగరంలోని ద్వారకానగర్‌లో జరిగింది. అనంతపురం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ కే. సాయినాథ్ తెలిపిన మేరకు.. ద్వారకానగర్‌కు చెందిన బి. జనార్దన రెడ్డి (50), ప్రసన్నలక్ష్మి దంపతులు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె సంతానం. కాంట్రాక్టర్ అయిన జనార్దన రెడ్డి శ్రీ సత్యసాయి జిల్లా పాలసముద్రం, ధర్మవరం, నంద్యాల జిల్లా గుమ్మడాపురం, అన్నమయ్య జిల్లా ఊటుకూరులో పలు పనులు చేశారు. ఇందుకోసం రూ.4.50 కోట్లు బయట అప్పు చేశారు. అయితే, పనులకు బిల్లులు కాకపోవడంతో కొన్ని రోజులుగా ఇబ్బందులు పడుతున్నారు. ఇదే క్రమంలో అప్పులిచ్చిన వారి ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. వడ్డీ కట్టలేకపోతున్నానని, అప్పిచ్చిన వారికి తన మొహం ఎలా చూపించాలంటూ కుటుంబసభ్యులతో బాధపడుతుండేవారు. జనార్దన రెడ్డికి అనంతపురం ఆర్ఎఫ్ రోడ్డులో ఉన్న కర్ణాటక బ్యాంకులో ఓడీ అకౌంట్ ఉంది. శుక్రవారం బ్యాంకుకు వెళ్లగా అప్పులకు గ్యారెంటీ రెన్యూవల్ విషయంలో మేనేజర్ దురుసుగా మాట్లాడారు. ఈ క్రమంలోనే తీవ్ర మనస్తాపం చెందిన జనార్దన రెడ్డి కారులో శ్రీనగర్‌కాలనీలోని అయ్యప్పస్వామి గుడి వద్దకు చేరుకున్నారు. విషపు గుళికలు మింగారు. విషయం తెలుసుకున్న మిత్రుడు మంజు వెంటనే అక్కడకు చేరుకుని సవేరా ఆసుపత్రికి తీసుకెళ్లి చేర్పించగా శనివారం మృతి చెందారు. బిల్లులు రాక ఇబ్బంది పడుతున్న పరిస్థితుల్లో బ్యాంకు మేనేజర్ దురుసుగా మాట్లాడటంతో తన భర్త ఆత్మహత్య చేసుకున్నారని మృతుడి భార్య ప్రసన్నలక్ష్మి నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## క్లుప్తంగా

### ఘనంగా 'ఎస్ఎస్‌బీఎన్' వసంతోత్సవాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూరరెడ్డి

**అనంతపురం ఎడ్యుకేషన్:** ఎస్ఎస్‌బీఎన్ విద్యా సంస్థల 80వ వసంతోత్సవాలు రెండోరోజు శనివారం ఘనంగా జరిగాయి. విద్యా సంస్థల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే సింధూరరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ... కళాశాలలో సుదీర్ఘంగా అధ్యాపకుడిగా పని చేసే అవకాశం దక్కడం తన అదృష్టమన్నారు. ఎమ్మెల్యే సింధూరరెడ్డి మాట్లాడుతూ... నేటి సమాజంలో గురువులకు గౌరవమైన స్థానం ఉందన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం ఎస్ఆర్ నాగభూషణం, రమేష్‌బాబు, కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకరరాజు, పూర్వ విద్యార్థులు రామ్మోహన్, చంద్రశేఖర్‌గుప్త, పద్మనాభరెడ్డి, శ్రీనివాసరెడ్డి, హిమకర్, భాగ్యలక్ష్మి, హరికిషోర్‌రెడ్డి, ముత్యాలరెడ్డి, హరినాథ్ పాల్గొన్నారు.

### ట్రాక్టర్ ఢీకొని వ్యవసాయ కూలీ మృతి

**తాడిపత్రి రూరల్:** ట్రాక్టర్ అదుపు తప్పి ఢీకొన్న ఘటనలో ఓ వ్యవసాయ కూలీ దుర్మరణం పాలైంది. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రి మండలం తాతగారిపల్లికి చెందిన మాబున్నీ (75) వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో శనివారం గ్రామ శివారులోని రోడ్డు పక్కన పొలంలో కూలి పనులకు వెళ్లింది. ట్రాక్టర్ సాయంతో పొలం పనులు చేస్తున్న డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో అదుపు తప్పి వేగంగా మాబున్నీని ట్రాక్టర్ ఢీకొంది. ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వెంటనే అక్కడి నుంచి పారిపోయాడు. విషయం తెలుసుకున్న తాడిపత్రి అప్‌గ్రేడ్ పీఎస్ ఎస్ఐ ధరణిబాబు, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై ఆరా తీశారు. కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

# సమస్యల కేంద్రీయం



సెంట్రల్ యూనివర్సిటీ హాస్టల్‌లోని మెస్

**అనంతపురం:** సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (కేంద్రీయ విశ్వవిద్యాలయం)లో అక్రమాలు కేంద్రీకృతమయ్యాయి. కార్పొరేట్ తరహాలో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డబ్బు వసూలు చేసినా... మౌలిక సౌకర్యాల కల్పనలో విఫలమైంది. దేశ వ్యాప్తంగా 17 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు సెంట్రల్ యూనివర్సిటీలో వివిధ కోర్సులు అభ్యసిస్తున్నారు. పబ్లిక్ వర్సిటీ అయినప్పటికీ నెలకు పెద్ద మొత్తంలో మెస్ బిల్లు చెల్లించుకోక తప్పడం లేదు. సరైన వసతి, పౌష్టికాహారం లేక వీరంతా ఆకలితో అలమటిస్తున్నారు. దీంతో విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. 2018లో జేఎన్‌టీయూఏలోని ఇంక్యుబేషన్ కేంద్రంగా వర్సిటీ స్థాపితమైన విషయం తెలిసిందే. ఇందులోనే అప్పట్లో తరగతులు నిర్వహించారు. అనంతరం 2022లో బళ్లారి రోడ్డులోని ఓ ప్రైవేట్ కళాశాలలో తాత్కాలిక క్యాంపస్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ఆగస్టులో జంతలూరులోని శాశ్వత భవనాల్లోకి క్యాంపస్‌ను మార్చారు. హాస్టళ్లు, అకడమిక్ భవనాలు పూర్తిగా వినియోగంలోకి వచ్చాయి. సెంట్రల్ యూనివర్సిటీలో ప్రస్తుతం వెయ్యి మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. 400 మంది అమ్మాయిలు, 600 మంది అబ్బాయిలు హాస్టళ్లలో బస చేస్తున్నారు.

**మెస్ పర్యవేక్షణ ప్రైవేట్‌కు..**

మెస్ బిల్లుతో పాటు ప్రతి సెమిస్టర్‌కు హాస్టల్ మెయింటెనెన్స్ కింద రూ.3వేలు, అద్దె రూ.2 వేలు చెల్లించాలి. కొత్తగా వచ్చిన విద్యార్థులు అయితే అద్దె ఏకంగా రూ.7 వేలు చెల్లించాలనే షరతు విధించారు. సెమిస్టర్ ప్రారంభం అయ్యే తొలి రోజే మెస్ బిల్లు, మెయింట్‌నెన్స్, అద్దె ముందస్తుగా చెల్లించాలి. కార్పొరేట్ కళాశాల తరహాలో ముందస్తుగా చెల్లిస్తేనే తరగతులకు, హాస్టళ్లకు అనుమతిస్తారు. మెస్ నిర్వహణను పూర్తిగా ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం వివాదస్పదమవుతోంది. ఏకంగా నెలకు ఒక్కో విద్యార్థి రూ. 3,200 మెస్ బిల్లు చెల్లించాల్సి వస్తోంది. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో నెలకు రూ.2,300 మాత్రమే మెస్‌బిల్లు ఉంటే ఇక్కడ మాత్రం భారీగా ఉండడం గమనార్హం. తాత్కాలిక క్యాంపస్‌లో తరగతులు నిర్వహించినప్పుడు కేవలం రూ. 2,315లు చొప్పున మెస్‌బిల్లు చెల్లించేవారు. సెంట్రల్ యూనివర్సిటీలో హాస్టల్‌లో అన్ని రకాల వంటలు వండాల్సి ఉంది. అయితే సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో మాత్రం పూర్తిగా ఉత్తర భారతదేశ వంటకాలు చేసి పెడుతున్నారు. ఈ వంటకాలను తినలేక సెంట్రల్ యూనివర్సిటీలో 60 నుంచి 70 శాతం మంది దక్షిణాది రాష్ట్రాలకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. చికెన్ అనే మాట ఏ రోజూ వినపడదు. ప్రతి బుధవారం ఓ కోడిగుడ్డు ఇస్తున్నారు.



**అస్మదీయులకు అప్పగింత..**

వాస్తవానికి పబ్లిక్ వర్సిటీల్లో స్టూడెంట్స్ మేనేజ్‌మెంట్ విధానం కింద హాస్టళ్లను నిర్వహించాల్సి ఉంది. వంట గ్యాస్, నిత్యావసర సరుకులు అన్నింటి ఖర్చు కలిపి లెక్కించి ఒక్కో విద్యార్థికి ఎంత వస్తే అంత మొత్తాన్ని మెస్‌బిల్లుగా నిర్ధారిస్తారు. ఇందుకు విరుద్ధంగా సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో ఒక్కో విద్యార్థి నుంచి నెలకు రూ.3,200 వసూలు చేస్తున్నారు. దీనికి గది అద్దె, మెయింటినెన్స్ అదనంగా చెల్లిస్తున్నారు. స్టూడెంట్ మేనేజ్‌మెంట్ హాస్టళ్లలో రూ.2 వేలకు మించి రాదు. ఎస్కేయూలోని మహిళా హాస్టళ్లలో రూ.1500లకు మించి మెస్‌బిల్లు రాదు. టెండర్లు పిలిచి ఎవరు తక్కువ రేటుకు ఆహారం అందిస్తారో వారికే అప్పగించాలి. కానీ, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో మాత్రం అధిక రేటుకు కోట్ చేసిన అస్మదీయులకు మెస్ బాధ్యత అప్పగించి విద్యార్థులపై అధిక భారం మోపుతున్నారు. ఎవరైనా విద్యార్థి ప్రశ్నిస్తే పరీక్షల్లో మార్కులు తగ్గించడం, ఫెయిల్ చేయడం వంటి చర్యలు తీసుకుంటుండడంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు.




సెంట్రల్ యూనివర్సిటీ ప్రధాన ద్వారం

**ఆహారం బాగోలేదు**

మెస్‌లో పూర్తిగా నార్త్ ఇండియన్ ఫుడ్ పెడుతున్నారు. 60 శాతం మంది ఉన్న సౌత్ ఇండియా వాళ్లకు ఈ ఆహారం రుచించడం లేదు. ఎన్నో దఫాలు వినతిపత్రాలు ఇచ్చాం. అయినా వర్సిటీ యాజమాన్యం స్పందించలేదు. గతంలో కేవలం రూ.2,300 మాత్రమే మెస్‌బిల్లు వచ్చేది. జంతలూరులోని శాశ్వత క్యాంపస్‌లోకి మారిన తర్వాత ఏకంగా రూ. 3,200 మెస్‌బిల్లు చెల్లించాల్సి వస్తోంది. సెమిస్టర్‌కు ముందుగానే బిల్లులు చెల్లించాలి. తక్కువ కోట్ చేసినవారికి టెండర్ అప్పగించి ఉంటే మాపై ఆర్థిక భారం పడేది కాదు.

– రాజేంద్ర, పీజీ పొలిటికల్ సైన్సెస్, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ

### ఫార్మసిస్టు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ

**అనంతపురం మెడికల్:** కడప జోన్ పరిధిలో 15 ఫార్మసిస్టు పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికను భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ మేరకు అనంతపురం జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. https://cfw.ap. nic.in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని ఈ నెల 17వ తేదీ లోపు వైఎస్సార్ జిల్లా కడపలోని ఆర్‌డీ కార్యాలయంలో అందజేయాలి. సెలవు దినాలైన ఈ నెల 5, 12, 13, 14, 15 తేదీల్లో దరఖాస్తులను స్వీకరించరు.

# హామీల అమలులో చిత్తశుద్ధి లేదా?

- 8 నెలల పాలనలో రాష్ట్ర ప్రజల నెత్తిన రూ.లక్ష కోట్ల అప్పులు
- స్థానిక సంస్థలను భ్రష్టు పట్టించిన డిప్యూటీ సీఎం పవన్
- మంత్రి కేశవ్‌కు పట్టని నియోజకవర్గ అభివృద్ధి
- మాజీ ఎమ్మెల్యే విశ్వ ధ్వజం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ (చిత్రంలో) జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వెన్నపూస రవీంద్రారెడ్డి

**ఉరవకొండ:** ఎన్నికల సమయంలో టీడీపీ ప్రకటించిన మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ హామీలను అమలు చేసే చిత్తశుద్ధి ఉందా? అంటూ సీఎం చంద్రబాబును ఉరవకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ప్రశ్నించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డితో కలసి ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఈ 8 నెలల్లోనే రాష్ట్ర ప్రజలపై రూ.లక్ష కోట్ల అప్పుల భారం రుద్దిందన్నారు. ఇచ్చిన హామీలు నేరవేర్చకుండా రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు.. ఇతర అన్ని రంగాలనూ మోసం చేశారన్నారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు పెట్టుబడి సాయం రూ. 20వేలు చెల్లిస్తామని ఎన్నికల సమయంలో కూటమి పెద్దలు ఇచ్చిన హామీకి దిక్కు లేకుండా పోయిందన్నారు. జిల్లాలో రబీ సీజన్‌లో 70వేల హెక్టార్లలో పంటలు సాగులోకి వస్తే ఇప్పటి వరకూ కనీసం 35 వేల హెక్టార్లకు కూడా పంటల బీమాకు సంబంధించి రైతులు ప్రీమియం చెల్లించలేకపోయారన్నారు. ఇది రైతు దుర్భర స్థితికి నిదర్శనమన్నారు. గత ప్రభుత్వం ఉచిత పంట బీమా పథకంతో రైతులకు అండగా నిలిచిందని గుర్తు చేశారు.

**నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టు**

వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను వేధించడం మాని నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని మంత్రి కేశవ్‌కు విశ్వ హితవు పలికారు. వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీపీ, జెడ్పీటీసీలు, ఇతర నాయకులను ప్రలోభాలకు గురి చేస్తూ వారిని టీడీపీలో చేర్చుకోవడంపై చూపిస్తున్న శ్రద్ధ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారంపై పెట్టకపోవడం సిగ్గు చేటన్నారు. అక్రమ కేసులు, పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ హయంలో హంద్రీ–నీవాకు రూ6,800 కోట్లతో కాలువలో నీటి ప్రవాహ సామర్థ్యాన్ని 6వేల క్యూసెలకు పెంచుతూ పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ జారీ చేసిన జీఓలను కూటమి ప్రభుత్వం రద్దు చేసి జిల్లాకు తీరని అన్యాయం చేసిందన్నారు. అంతేకాక కాలువలో నీటి ప్రవాహ సామర్థ్యాన్ని 3,800 క్యూసెక్కులకు కుదించి, లైనింగ్ పనులు చేపట్టిందన్నారు. ఈ పనులు పూర్తయితే జిల్లాకు 40 టీఎంసీలకు బదులు కేవలం 19 టీఎంసీల నీరు మాత్రమే అందుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలు, యువతులు, బాలికలపై అత్యాచారాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసేలా కుట్ర పూరిత పాలన సాగిస్తున్నారని వెన్నపూస రవీంద్రారెడ్డి మండిపడ్డారు. కేవలం ఉపాధి హామీ పథకం నిధులు మాత్రమే మంజూరు చేసి, స్థానిక సంస్థలకు నయాపైసా కూడా ఇవ్వకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఉరవకొండ, విడపనకల్లు, కూడేరు, వజ్రకరూరు ఎంపీపీలు నరసింహులు, కరణం పుష్పవతి, నారాయణరెడ్డి, దేవీబాయి, వైస్ ఎంపీపీలు శ్రీనాథ్‌రెడ్డి, పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఏసీ పార్వతమ్మ, పార్టీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బెస్త రమణ, జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న, పంచాయతీ రాజ్, బీసీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు యోగేంద్రరెడ్డి, దేవేంద్ర, నాయకులు హావళిగి భరత్‌రెడ్డి, అశోక్, బసవరాజు పాల్గొన్నారు.

### రైతులకు అన్యాయం చేస్తే ఉద్యమమే : సీపీఐ



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ, రైతు సంఘం నాయకులు

**అనంతపురం అర్బన్:** రైతులకు అన్యాయం జరిగినా... చేయాలని చూసినా పెద్ద ఎత్తున ఉద్యమమిస్తామని కూటమి సర్కార్‌ను సీపీఐ, రైతు సంఘం నాయకులు హెచ్చరించారు. హంద్రీ–నీవా కాలువ వెడల్పు చేసి ఆయకట్టుకు నీరివ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం కలెక్టరేట్ ఎదుట సీపీఐ, రైతు సంఘం నాయకులు సంయుక్తంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున మాట్లాడారు. హంద్రీ–నీవా కాలువను 10 వేల క్యూసెక్కుల సామర్థ్యానికి వెడల్పు చేయండా లైనింగ్ చేయడమంటే జిల్లా రైతులకు తీరని ద్రోహం చేసినట్లవుతుందన్నారు. నీటి ప్రవాహ సామర్థ్యాన్ని పది వేల క్యూసెక్కులకు పెంచుతామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కూటమి పెద్దలు అమలు చేయకపోగా... జీడిపల్లి నుంచి కాలువకు లైనింగ్ చేయాలని తీసుకున్న నిర్ణయం సరైంది కాదన్నారు. పిల్లకాలువలు ఏర్పాటు చేయకుండా నీటిని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నాలు చూస్తుంటే జిల్లా రైతులకు అన్యాయం చేసే కుట్ర బహిర్గతమవుతోందన్నారు. కాలువను వెడల్పు చేసి ఆయకట్టుకు నీరు ఇచ్చిన తర్వాతనే ముందుకు తీసుకెళ్లాలన్నారు. లేకుంటే రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పి.రామకృష్ణ, రమేష్, రామకృష్ణ, వెంకటరాముడు, చలపతి, దుర్గాప్రసాద్, రాజేష్ గౌడ్, నరేష్, కుళ్లాయిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

### నరసాపూర్ ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన పెను ప్రమాదం

**ధర్మవరం:** నరసాపూర్– ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలుకు శనివారం పెను ప్రమాదం తప్పింది. చలి తీవ్రత కారణంగా శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలం తిప్పేపల్లి సమీపంలో ఎల్‌సీ నెంబరు– 8 వద్ద రైలు పట్టా పాక్షికంగా విరిగింది. విషయాన్ని గుర్తించిన కీమెన్ బండి ప్రసాద్ వెంటనే అప్రమత్తమై అప్పటికే 120 కిలోమీటర్ల వేగంతో దూసుకొస్తున్న నరసాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలును ఆపేందుకు ఎర్ర జెండా ఊపుతూ ఎదురుగా పరుగెత్తుకెళ్లాడు. లోకో పైలెట్ రైలును ఆపే లోపు పాక్షికంగా దెబ్బతిన్న పట్టా ప్రాంతాన్ని దాటుకుని రెండు బోగీలు ముందుకెళ్లాయి. అనంతరం అదే రైలులో ప్రయాణిస్తున్న ఇంజినీరింగ్ అధికారుల సూచన మేరకు రైలును నెమ్మదిగా ముందుకు నడుపుతూ ధర్మవరం స్టేషన్‌కు చేర్చారు. అనంతరం అధికారులు మరమ్మతులు చేపట్టారు.

# హంతకుడిని పట్టించిన మేకలు!

- జీపీ మాజీ ఉపాధ్యక్షుడి హత్య
- 24 గంటలు గడవకనే కటకటాల పాలైన నిందితుడు



హతుడు నరసింహప్ప (ఫైల్)

**పావగడ:** తమ యజమానిని హతమార్చిన దుండగుడిని 24 గంటలు గడవక ముందే మేకలు పట్టించాయి. వివరాలు... పావగడ తాలూకా కేటీ హళ్లి గ్రామ పంచాయతీ పరిధిలోని దేవలకెరె గ్రామానికి చెందిన నరసింహప్ప (55), రామక్క దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందిన నరసింహప్ప గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షుడిగాను పనిచేసి అందరి మన్ననలు పొందారు. కొన్నేళ్ల క్రితం భార్య మృతి చెందింది. అప్పటి నుంచి ఇద్దరు కుమారులతో కలసి మేకల పోషణతో కుటుంబాన్ని పోషించుకునేవారు.

**గొంతు కోసి.. హతమార్చి**

తన మేకలను నరసింహప్ప శుక్రవారం ఉదయం దేవలకెరె గ్రామ సమీపంలోని అటవీ ప్రాంత తిప్పప్పన కొండ ప్రాంతానికి తోలుకెళ్లాడు. మధ్యాహ్నం అటుగా వెళ్లిన వారు విగతజీవిగా పడి ఉన్న నరసింహప్పను గుర్తించి సమాచారం ఇవ్వడంతో కుమారులు మంజునాథ్, వీరభద్ర, పోలీసులు, పెద్ద సంఖ్యలో స్థానికులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కొడవలితో నరసింహప్ప గొంతు కోసి హతమార్చినట్లుగా నిర్ధారణ అయింది. ఎడమ చేతి వేళ్లనూ కత్తిరించినట్లుగా గుర్తించారు. మేపునకు తోలుకెళ్లిన 30 మేకల జాడ లేకుండా పోయింది. దీంతో మేకలను అపహరించుకెళ్లడంలో భాగంగా నరసింహప్పను దారుణంగా హతమార్చినట్లుగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించి, కేసు నమోదు చేశారు.



**బాధలోనూ ఆలోచించి..**

తండ్రిని దారుణంగా హతమార్చిన బాధలోనూ పెద్దకుమారుడు మంజునాథ్ ఎంతో వివేకంతో ఆలోచించాడు. వెంటనే ద్విచక్ర వాహనాన్ని వేసుకుని శుక్రవారం రాత్రికి రాత్రే హరియూరుకు చేరుకున్నాడు. అక్కడ జరిగే మేకల సంతలో శనివారం ఉదయం విక్రయానికి పెట్టిన తన మేకలను గుర్తించాడు. కాసేపటి తర్వాత వాటిని అమ్ముతున్న వ్యక్తిని పట్టుకుని సమాచారం ఇవ్వడంతో అరసికెరె పోలీసులు అక్కడకు చేరుకుని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో కరియమ్మనపాళ్య గ్రామానికి చెందిన మణికంఠగా గుర్తించారు. నరసింహప్పను తానే హతమార్చి మేకలను అపహరించినట్లు పోలీసుల ఎదుట మణికంఠ అంగీకరించాడు. దీంతో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని పూర్తి స్థాయిలో విచారిస్తున్నారు. కాగా, ఎంతో సౌమ్యుడిగా పేరొందిన నరసింహప్ప హత్యతో దేవలకెరె గ్రామం మూగబోయింది. సమాచారం అందుకున్న వాల్మీకి సంఘం నాయకులు దేవలకెరె గ్రామం చేరుకుని నరసింహప్ప మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

### గణితం ఇష్టంతో నేర్చుకోవాలి



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

**అనంతపురం ఎడ్యుకేషన్:** గణిత సబ్జెక్టును కష్టంతో కాకుండా ఇష్టంతో నేర్చుకుంటే సులువుగా అర్థమవుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు సూచించారు. 'గణిత ఫోరం' ఆధ్వర్యంలో శనివారం స్థానిక జిల్లా సైన్స్ సెంటర్‌లో గణిత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల 8, 9, 10 తరగతుల విద్యార్థులు గణితశాస్త్రంపై రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. అలాగే వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు జీఎల్ఎన్ ప్రసాద్, డాక్టర్ కిరణ్, డైట్ విశ్రాంత అధ్యాపకుడు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఆయా విభాగాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను డీఈఓ అందజేసి, మాట్లాడారు. గణితంలో పట్టుసాధిస్తే ఏ రంగంలోనైనా రాణిస్తారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ శ్రీనివాసరావు, సైన్స్ క్యూరేటర్ బాలమురళీకృష్ణ, సమగ్రశిక్ష ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్‌జీసీ రీజనల్ కోఆర్డినేటర్ ఆనందభాస్కర్‌రెడ్డి, గణిత ఫోరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశులు, శివప్రసాద్, కార్యవర్గ సభ్యులు రమణారెడ్డి, డెగావత్ రవీంద్రనాయక్ పాల్గొన్నారు.

### 'టగ్ ఆఫ్ వార్'లో జాతీయ స్థాయికి ఎంపిక



రమాదేవి

**గుత్తి:** స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సర విద్యార్థిని రమాదేవి జాతీయ స్థాయి టగ్ ఆఫ్ వార్ క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ మీనాక్షి శనివారం తెలిపారు. జాతీయ స్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన రమాదేవిని ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు. అనంతరం క్రీడా పోటీల్లో పాల్గొనడానికి మహారాష్ట్రకు రమాదేవి బయలుదేరి వెళ్లింది. ఈ సందర్భంగా విద్యార్థినికి అధ్యాపక బృందం ఆర్థిక సహాయం అందజేసింది.

### ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**పామిడి:** స్థానిక పెన్నానది పరివాహక ప్రాంతం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న 9 ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. యజమానులపై కేసు నమోదు చేసినట్లు సీఐ యుగంధర్ తెలిపారు.

### ఉచిత శిక్షణ

**అనంతపురం రూరల్:** పారిశ్రామిక రంగంలో స్వయం ఉపాధి కోసం అందిస్తున్న శిక్షణకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు జిల్లా మైనారిటీ కార్పొరేషన్ అధికారి సుబ్రహ్మణ్యం శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న ముస్లిం మైనారిటీ అభ్యర్థులు తమ దరఖాస్తులను జిల్లా మైనారిటీ కార్పొరేషన్‌లో అందజేయాలని పేర్కొన్నారు.

### ఇద్దరి ఆత్మహత్య

**రాయదుర్గంటౌన్:** మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో డిగ్రీ చదువుతున్న యువతి, పట్టణంలోని కోట మారెమ్మగుడి వద్ద నివాసం ఉంటున్న ఓ వివాహిత శనివారం ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు... నాగిరెడ్డిపల్లికి చెందిన గోవిందరెడ్డి, సావిత్రమ్మ దంపతుల కుమార్తె భారతి(19) కర్ణాటకలోని బళ్లారిలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ నెల 2న గ్రామానికి వచ్చిన భారతి శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కడుపునొప్పి తాళలేక ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే రాయదుర్గంలోని కోట మారెమ్మగుడి ఏరియాలో నివాసముంటున్న తాపీ మేస్త్రీ శివ భార్య అంబిక (23) శనివారం రాత్రి ఇంట్లో ఉరివేసుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## క్లుప్తంగా

### మెరుగైన వైద్య సేవలందించాలి



వైద్య సేవలపై ఆరా తీస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్

**అనంతపురం మెడికల్:** మానసిక సమస్యతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్య సేవలందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.శివప్రసాద్ వైద్యులను ఆదేశించారు. శనివారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని మానసిక వైద్య విభాగం వార్డును ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల కందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం వన్‌స్టాప్ సెంటర్‌ను పరిశీలించారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రికి వచ్చే రోగులకు ఉత్తమ సేవలందించాలన్నారు. కార్యక్రమంలో మానసిక వైద్య విభాగం వైద్యురాలు డాక్టర్ శారద తదితరులు పాల్గొన్నారు.

### పనులు వేగవంతం చేయాలి



షెడ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ సలీమ్ బాషా

**ఆత్మకూరు:** మండలంలో చేపట్టిన సీసీ రోడ్లు, ఆవుల షెడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని డ్వామా పీడీ సలీమ్ బాషా సూచించారు. శనివారం మండలంలోని వడ్డుపల్లి, తలుపూరు వద్ద జరుగుతున్న షెడ్ల నిర్మాణాలను పనులను పర్యవేక్షించారు. మందకొడిగా సాగుతున్న పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు ఎందుకు వేగవంతం చేయలేదని ఆరా తీశారు. పనులు ముందుకు సాగకపోవడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. జనవరిలోపు పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు నాణ్యతగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ సుజాత, ఈఓ భాస్కర్ పాల్గొన్నారు.


### ఫ్రెండ్‌షిప్ సిరీస్ విజేత హట్‌హక్స్ జట్టు



ఇంగ్లండ్ టెస్ట్ క్రికెటర్ హసీబ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**అనంతపురం:** స్థానిక ఆర్డీటీ స్టేడియంలో శనివారం జరిగిన హట్‌హక్స్ న్యూజిలాండ్, అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ జట్ల మధ్య ఫ్రెండ్‌షిప్ సిరీస్ విజేతగా హట్‌హక్స్ న్యూజిలాండ్ జట్టు నిలిచింది. ఇంగ్లండ్ టెస్ట్ క్రికెటర్ హసీబ్ హమీద్ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. అనంతపురంలో అంతర్జాతీయ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తుండడం సంతోషదాయకమన్నారు. న్యూజిలాండ్ మాజీ క్రికెటర్ బ్రూసీ ఎడ్గర్ మాట్లాడుతూ.. యువ క్రీడాకారుల నైపుణ్యాలు పెంపొందించడానికి ఆర్డీటీ స్టేడియం మంచి వేదికగా దోహదపడుతుందన్నారు. రంజీ మాజీ క్రికెటర్ కేఎస్ షాహబుద్దీన్, ఆంధ్రా మాజీ క్రికెటర్ రవికృష్ణమూర్తి, ఏడీసీఏ అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ వి.భీమలింగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, మొత్తం మూడు వన్‌డే సిరీస్‌లు నిర్వహించగా శనివారం జరిగిన మ్యాచ్‌లో అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ గెలిచింది. మొత్తం సిరీస్‌ను హట్‌హక్స్ జట్టు గెలుచుకుంది.

### ఇన్‌స్పైర్ కప్ ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం



టోర్నీ ప్రారంభానికి ముందు ఫుట్‌బాల్ జట్ల కెప్టెన్లు

**అనంతపురం:** అనంతపురం స్పోర్ట్స్ విలేజ్ వేదికగా లాలిగా ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ కప్ టోర్నీ శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ నెల 9న టోర్నీ ముగియనుంది. దేశ వ్యాప్తంగా 12 జట్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నాయి. 216 మంది మహిళా ఫుట్‌బాల్ క్రీడాకారిణులు ప్రాతినిధ్యం వహించనున్నారు. నర్మద వ్యాలీ (మధ్యప్రదేశ్), థామ్ (తమిళనాడు), లైఫ్ స్పోర్ట్స్ (తమిళనాడు), నంది ఫౌండేషన్ (గుజరాత్), అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ (ఆంధ్రప్రదేశ్), స్పోర్ట్స్–ఫుట్‌బాల్ అకాడమీ (తమిళనాడు), ఫాల్కన్ గర్ల్స్ (ఒడిశా), లిబర్టీ లేడీస్ (తమిళనాడు), బెంగళూరు ( కర్నాటక) జట్లు తలపడనున్నాయి.

### పేకాట స్థావరంపై దాడి

**రాప్తాడురూరల్:** అనంతపురం రూరల్ మండల పరిధిలోని ముండబండపల్లిలో పేకాట స్థావరంపై రూరల్ పోలీసులు శనివారం మెరుపుదాడి చేశారు. ఐదుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని రూ.12,300 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాంబాబు తెలిపారు.

# నిర్మించారు.. వదిలేశారు



- గోరుచిక్కుడు జిగురు పరిశ్రమ కోసం గోదాముల నిర్మాణం
- ఇందుకోసం రూ.4.5 కోట్ల నిధులు కేటాయింపు
- 2019లో చిరుధాన్యాల యూనిట్‌గా మార్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ప్రారంభించేందుకు చర్యలు తీసుకోని అధికారులు



జాతీయ రహదారి పక్కన నిరుపయోగంగా ఉన్న గోదాములు

**కనగానపల్లి:** రూ.కోట్ల ప్రభుత్వ ధనం వెచ్చించి నిర్మించిన గోదాములు నిరుపయోగంగా ఉన్నాయి. మండలంలోని దాదులూరు సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కన గోరుచిక్కుడు జిగురు మార్కెటింగ్, ప్రాసెసింగ్ పరిశ్రమ కోసం అప్పటి టీడీపీ ప్రభుత్వంలో గోదాముల నిర్మాణాన్ని చేపట్టారు. ఇందుకోసం జాతీయ రహదారి పక్కన విలువైన 5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. తర్వాతా గోదాముల నిర్మాణం కోసం రూ.4.5 కోట్ల నిధులు కేటాయించారు. 2018 ఏప్రిల్ నెలలో పనులు ప్రారంభించారు. కాని టీడీపీ ప్రభుత్వ హయాంలో నిధులు సక్రమంగా నిధులు మంజూరు కాలేదు. అలాగే గోరుచిక్కుడు పంట సాగు కూడా తగ్గిపోవటంతో గోదాముల నిర్మాణం కూడా కొద్ది రోజులు ఆగిపోయింది.

**ఆగిపోయిన గోరుచిక్కుడు సాగు**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వర్షాభావ పరిస్థితుల వల్ల 2014 నుంచి 2018 వరకు తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో జిల్లాలోని కొందరు రైతులు వేరుశనగ సాగు తగ్గించి తక్కువ వర్షపాతానికి పండే గోరుచిక్కుడు పంట సాగుచేసేందుకు ముందుకొచ్చారు. కాని ఈ పంటను కొనుగోలు చేసేందుకు ఈ ప్రాంతంలో మార్కెటింగ్ సదుపాయం లేకపోవడంతో స్థానిక రైతులు, వ్యవసాయాధికారులు గోరుచిక్కుడు జిగురు పరిశ్రమను నెలకొల్పాలని ప్రభుత్వాన్ని కోరారు. దీంతో రైతులు పండించిన గోరుచిక్కుడు విత్తనాలను కొనుగోలు చేసి ప్రాసెసింగ్ చేసేందుకు గోదాముల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కాని అప్పటి ప్రభుత్వం గోదాములు నిర్మాణం పూర్తి చేసే లోపు రైతులు గోరుచిక్కుడు పంటను సాగు చేయడం నిలిపేశారు.

**సమాచారం లేదు**

నిరుపయోగంగా ఉన్న ఈ గోదాములపై మార్కెఫెడ్ జిల్లా అధికారులను సంప్రదించగా.. ఈ గోదాముల వినియోగంపై మా వద్ద పూర్తి సమాచారం లేదని తెలిపారు. రాష్ట్రస్థాయి అధికారులే దీనిపై వివరణ ఇవ్వాలన్నారు.

**ప్రారంభిస్తే మేలు..**

2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతా అర్ధంతరంగా ఆగిపోయిన గోరుచిక్కుడు జిగురు పరిశ్రమను చిరుధాన్యాల నిల్వ యూనిట్‌గా మార్పు చేశారు. దీంతో అధికారులు ఆగిపోయిన గోదాములు నిర్మాణం పనులు తిరిగి ప్రారంభించి 95 శాతం పైగా పనులు పూర్తి చేయించారు. తర్వాత వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులు ఎవ్వరూ వీటి గురించి పట్టించుకోలేదు. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన గోదాములు నిరుపయోగంగా ఉన్నాయి. దీనికి తోడు ఈ గోదాముల చుట్టూ ప్రహరీ లేకపోవటంతో వీటికి రక్షణ కరువైంది. నిరుపయోగంగా ఉన్న ఈ గోదాములను ప్రభుత్వం వెంటనే ప్రారంభించి రైతులకు ఉపయోగకరంగా మార్చాలని స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరుతున్నారు.

### ప్రైవేట్ పాఠశాలల సమస్యలు పరిష్కరించండి

**అనంతపురం ఎడ్యుకేషన్:** జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం (ఏపీపీఎస్ఏ) నాయకులు విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక డీఈఓ కార్యాలయంలో ఏడీ కృష్ణయ్య, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ చేతుల మీదుగా ప్రైవేట్ పాఠశాలల సంఘం 2025 కేలండర్‌ను వారు ఆవిష్కరింపజేసిన అనంతరం మాట్లాడారు. మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే పీహెచ్ విద్యార్థుల సర్టిఫికెట్లను వెంటనే పరిశీలించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అలాగే దరఖాస్తు సమయంలో ఏవైనా పొరబాట్లు జరిగి ఉంటే మార్పు చేసుకునేందుకు ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏపీపీఎస్ఏ జిల్లా గౌరవాధ్యక్షుడు గంగాధర్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపాల్‌రెడ్డి, రమణారెడ్డి, సీఆర్‌ఓ రవిచంద్రారెడ్డి, నాయకులు రామచంద్ర, చంద్రశేఖర్ రెడ్డి, రామాంజనేయులు, చిత్తయ్య, బాబయ్య, శేషాద్రిరెడ్డి, సుధాకర్, మహమ్మద్ అమీన్, కళ్యాణ్, రఫి, నాగిరెడ్డి, సోమశేఖర్ పాల్గొన్నారు.

### కమనీయం.. కల్యాణం

**అనంతపురం కల్చరల్:** నగరంలోని ప్రాచీన చెన్నకేశవ స్వామి దేవాలయంలో శనివారం శ్రీవారి తిరు కల్యాణోత్సవ వేడుకలు కమనీయంగా సాగాయి. ఆలయ అనువంశిక ధర్మకర్త బీఆర్ వత్సలానందన్ నేతృత్వంలో వేదపండితులు గోదాదేవి, శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి పరిణయ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఎదురుకోలు, తలంబ్రాలు, మాంగళ్య ధారణ ఘట్టాలను వేదమంత్రోచ్చారణల నడుమ శ్రీవైష్ణవ పద్ధతుల్లో నిర్వహించారు. ఈనెల 10న ముక్కోటి ఏకాదశి పర్వదినం వైభవంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు.

# అంధుల ఆరాధ్య దైవం లూయీ బ్రెయిలీ



కృష్ణ కళా మందిర్‌లో లూయీ బ్రెయిలీ చిత్రపటానికి నివాళి



లూయీ బ్రెయిలీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అంధ ఉద్యోగుల సంఘం నాయకులు

**అనంతపురం కల్చరల్:** జాతీయ అంధుల సమాఖ్య ఆధ్వర్యంలో మూడు రోజులు పాటూ సాగిన క్రీడా సాంస్కృతిక వేడుకలు శనివారం ఘనంగా ముగిశాయి. స్థానిక కృష్ణ కళామందిరంలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 200 మంది వేర్వేరు సంఘాల ప్రతినిధులు హాజరై అంధుల సమస్యల వాణిని వినిపించారు. అంధులు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. క్రీడా పోటీల విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. క్యాలెండర్లను ఆవిష్కరించి వితరణ చేశారు. అంతకుముందు అంధ కళాకారులు ఆ పాత మధురాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో విజయభాస్కర్, ఎంపీ లక్ష్మీనారాయణ, సీక్రెట్ సంస్థ అధ్యక్షుడు సీపీ తిప్పన్న, డాక్టర్ జగన్‌మోహన్, బీసీ కార్పొరేషన్ డీడీ కొఠారి కుష్బు కొఠారీ, సామాజిక సేవా కార్యకర్త రవికాంత్ రమణ, విజయ్‌సాయి, రాష్ట్ర అధ్యక్షుడు నాగార్జున, జా తీయ అంధుల సమాఖ్య ప్రతినిధులు రవి, అంకిరెడ్డి, నాగశివారెడ్డి, ఎర్రిస్వామి, లక్ష్మీనారాయణమ్మ పాల్గొన్నారు.

**అనంతపురం రూరల్:** అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన గొప్ప మహనీయుడు లూయీ బ్రెయిలీ అని అంధ ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీ రాము కొనియాడారు. లూయీ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని శనివారం శిల్పారామంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంధ ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ.. తాము ప్రపంచాన్ని చూడలేకపోయినా తమ కోసం ప్రత్యేక లిపి రూపొందించడంతో ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. అంధులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అంధ ఉద్యోగ సంఘం నాయకులు విశ్వనాద్, ఖాజాపీరా, హుస్సేన్‌పీరా, అక్రం అదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

**రాప్తాడు:** చిన్నారులకు బాల్య వివాహాలు చేయవద్దు. అలా కాకుండా ఎవరైనా తల్లిదండ్రులు వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని కిశోరి వికాసం స్టేట్ లెవల్ ట్రైనర్ బిఎస్ శ్రీదేవి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్డీటీ కార్యాలయంలో కిశోరి వికాసంపై మండల స్థాయిలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేట్ లెవల్ ట్రైనర్ బీఎస్ శ్రీదేవి మాట్లాడుతూ.. కిశోర వికాసం అనేది నిరంతర ప్రక్రియ అన్నారు. బాల్య వివాహాలు, లైంగిక హింస, టీనేజ్ ప్రెగ్నెన్సీ లాంటి సమస్యలను బాలికలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కిశోర వికాస గ్రూపులను ఏర్పాటు చేసి వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. ఆడపిల్లకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లు పూర్తయిన తర్వాతే పెళ్లిళ్లు చేయాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా బాల్య వివాహలు చేస్తుంటే 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. బాల్య వివాహాలు చేసిన వారికి బాల్య వివాహాల నిషేధ చట్టం -2006 ప్రకారం రెండేళ్లు జిల్లా శిక్ష, రూ.లక్ష జరిమానా విధించడం జరుగుతుందని పేర్కొన్నారు.



కిశోరి వికాసం పోస్టర్లను విడుదల చేస్తున్న స్టేట్ లెవల్ ట్రైనర్ బీఎస్ శ్రీదేవి

అనంతరం కిశోరి వికాసం పోస్టర్లను ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీడీపీఓ ధనలక్ష్మి, సూపర్‌వైజర్లు నాగరత్న, ఝాన్సీరాణి, ఈఓఆర్డీ ఆనంద ప్రసాద్, సీహెచ్‌ఓ శివప్రసాద్, ఏపీఎం సునీత, హెచ్‌ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత





మాట్లాడుతున్న మంత్రాలయ పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థుల శ్రీపాదులు

**అనంతపురం కల్చరల్:** ధర్మ పరిరక్షణే ధ్యేయంగా మహాపురుషుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని జీవించాలని పలువురు పీఠాధిపతులు, ఆధ్యాత్మిక వేత్తలు సూచించారు. హనుమాన్ చాలీసా ప్రచార సమితి, శ్రీపవనసుత యువజన సేవాట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్ట్స్ కాలేజ్ వేదికగా సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. భగవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపకులు గంగాధర శాస్త్రి, మంత్రాలయ పీఠాధిపతులు శ్రీసుభుదేంద్ర తీర్థుల స్వామీజీ, హనుమంతుడి జన్మస్థలమైన హంపీ నుంచి పీఠాధిపతులు శ్రీవిద్యారణ్య భారతీ మహాస్వామిజీ, ఆర్ఎస్ఎస్ నుంచి శ్యామకుమార్ తదితరులు అతిథులుగా హాజరయ్యారు. చిన్నారుల్లో బాల్యం నుంచే హనుమాన్ చాలీసా పఠనం చేయించడం ద్వారా ఆత్మస్థైర్యాన్ని, క్రమశిక్షణను పెంపొందించవచ్చని పిల్లలను ఆ దిశగా ప్రోత్సహించాలని సూచించారు. త్వరలో అనంత వేదికగానే 50 వేల మందితో హిందూ విరాట్ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు స్వామీజీలు ప్రకటించారు.

**ఆకట్టుకున్న కళారూపాలు..**

నాట్యాచార్యులు సంధ్యామూర్తి శిష్యబృందం హనుమాన్ చాలీసా నృత్యరూపకాన్ని అద్భుతంగా ప్రదర్శించి అలరించారు. కోలాటంతో హనుమంతుడి వేషధారణతో సాగిన మరో జానపద నృత్యం మైమరపించింది. వేలాది మంది పాఠశాలల విద్యార్థులు తరలి వచ్చి జై శ్రీరామ్ నామస్మరణతో మార్మోగించారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లోకి ఎక్కిన డాక్టర్ కొండా నరసింహారావు, అలువేలు మంగ దంపతుల శంఖారావం, అంతా రామమయం అంటూ ఆలపించిన గంగాధర శాస్త్రి ఆలపనలు, భగవద్గీత శ్లోకాలు ఆకట్టుకున్నాయి. వేణుగోపాల్, నిర్వాహకులు ప్రమోద్‌స్వామి, ఆకుల రాఘవేంద్ర, భవానీ రవికుమార్, శ్రీపాద వేణు, పాలసముద్రం నాగరాజు, మురళీ, న్యాయవాది గురుప్రసాద్ పాల్గొన్నారు.



హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్న విద్యార్థులు, భక్తులు

# పరశురాం.. నోరు అదుపులో పెట్టుకో

**ఆత్మకూరు:** అధికారం శాశ్వతం కాదు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని తమ నాయకులను ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి బండి పరశురాంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక ఎంపీపీ చాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బండి నాగరాజు మాట్లాడారు. బండి పరశురాం అధికారాన్ని అడ్డం పెట్టుకుని కుల రాజకీయాలు చేస్తున్నారని తెలిపారు. మా నాన్న అయిన బండి అహోబిలంకు చెందిన భూమిని బండి పరశురాం వాళ్ల నాన్న కబ్జా చేశారన్నారు. సదరు భూమి ఇస్తే సాగు చేసుకుంటామని చెప్పినందుకు తమపై దాడి చేశారని పేర్కొన్నారు. ఈ విషయంపై గతంలో పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా నమోదైనట్లు తెలిపారు. నేను ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకుంటుంటే తోపుదుర్తి చందు దగ్గరుండి తన భూమి కాగితాలను తోపుదుర్తి గ్రామంలో ఉన్న మరొకరికి ఇచ్చి అప్పు ఇప్పించి ఆదుకున్నాడని తెలిపారు. చిన్న పిల్లల కిడ్నాప్, దాడి కేసులతో బండి పరశురాంపై రౌడీ షీట్ ఓపెన్ అయినట్లు పేర్కొన్నారు. అక్రమ కేసుల వల్ల కాలేదన్నారు. అధికారం వచ్చినప్పటి నుంచి బి.యాలేరులో బండి పరశురాం చేష్టలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. వైఎస్సార్ విగ్రహంపై దాడి, ప్రభుత్వ శిలాఫలకాల ధ్వంసం, మహిళపై దాడి చేసి అక్రమ కేసులు బనాయించారని పేర్కొన్నారు. పట్టాలు ఉన్న భూమిలో పునాదులు తొలగించారని మండిపడ్డారు. రాప్తాడు నియోజకవర్గంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓర్వలేక అప్పట్లో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిపై నిరాధార ఆరోపణలతో ఎల్లో మీడియాలో వార్తలు రాయించారని తెలిపారు. ఇందుకు నిరసనగా చంద్రబాబు, లోకేష్‌పై తోపుదుర్తి చందు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. అయితే వెంటనే బహిర్గతంగా మీడియా ఎదుట క్షమాపణలు కోరినట్లు గుర్తు చేశారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న ప్రకాష్‌రెడ్డి విశాఖపట్నంలో ప్రెస్‌మీట్ పెట్టి తన అన్న మాట్లాడిన భాష తప్పు అని.. భావం కరెక్టు అని ఆరోజే మాట్లాడారని తెలిపారు. అధికారం ఉందని బండి పరశురాం కులాన్ని అడ్డుపెట్టుకుని గ్రామాల్లో కక్షలకు ఆజ్యం పోస్తున్నారని మండిపడ్డారు. తమ నాయకులు తోపుదుర్తి చందు, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, మాజీ కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పార్వతమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వర రెడ్డి, అంజినప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

## సంక్షిప్త సమాచారం

**సత్కారం**

**అనంతపురం:** రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ ఎంపీ లక్ష్మయ్యకు ఫిజిక్స్ విభాగం పూర్వ విద్యార్థులు, పరిశోధన విద్యార్థులు శనివారం ఎస్కేయూలో ఘనంగా సత్కరించారు. మాజీ రిజిస్ట్రార్‌గా, ప్రొఫెసర్‌గా ఆయన సేవలను కొనియాడారు. ప్రొఫెసర్ లక్ష్మయ్య సేవలు ప్రశంసనీయమన్నారు.

**మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య**

**రాప్తాడురూరల్:** మద్యానికి బానిసైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అనంతపురం రూరల్ మండలం కళ్యాణదుర్గం రోడ్డు కక్కలపల్లి కాలనీ పంచాయతీ పరిధిలోని మబ్బుకొట్టాలులో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మబ్బుకొట్టాలుకు చెందిన మల్లికార్జున, జానకి దంపతులకు ఆచారి కృష్ణ (18) కుమారుడు ఉన్నాడు. తల్లిదండ్రులు ఇద్దరూ ప్రస్తుతం వేర్వేరుగా ఉంటున్నారు. ఆచారికృష్ణ తల్లితో ఉంటున్నాడు. ఆటో తోలుకుంటూ జీవనం సాగించేవాడు. అయితే ఆచారికృష్ణ ఇటీవల కాలంలో మద్యానికి బానిసయ్యాడు. మానేయాలనుకుని ఎంత ప్రయత్నం చేసినా అదుపు చేసుకోలేకపోయాడు. దీంతో మనస్థాపానికి గురై శుక్రవారం సాయంత్రం ఇంట్లో తల్లి లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. ఇంటికి వచ్చిన తల్లి తలుపు ఎన్ని మార్లు తట్టినా ఉపయోగం లేకపోయింది. చుట్టుపక్కల వారి సాయంతో బలవంతంగా తీసి వెళ్లి చూడగా కుమారుడు ఉరికి వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. వెంటనే సర్వజన ఆస్పత్రికి తరలించినా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. శనివారం మృతుడి తల్లి జానకి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

**నర్సింగ్ కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం**

**అనంతపురం సెంట్రల్:** రవాణాశాఖ (ఆర్టీఏ) కార్యాలయం ఎదురుగా ఐదు నిమిషాలు రోడ్డుపై నడవాలన్నా.. వాహనాలు నిలుపుకోవాలన్నా ప్రజలు జంకుతున్నారు. మురుగు కాలవ నుంచి వచ్చే దుర్గంధాన్ని భరించలేక పోతున్నారు. నిర్మల నర్సింగ్ కళాశాల హాస్టల్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణం ఈ పరిస్థితి నెలకొందని వాహనదారులు పేర్కొంటున్నారు. ఇక్కడి హాస్టల్‌లో వందల మంది విద్యార్థులు ఉంటున్నారు. అయితే సరైన మురుగునీటి వ్యవస్థ లేకపోవడంతో నేరుగా మురుగు కాలువలోకి వదులుతున్నారు. దీంతో భరించలేని వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరపాలకసంస్థ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**గుత్తి కోట క్యాలెండర్ ఆవిష్కరణ**

**అనంతపురం కల్చరల్:** జిల్లా పురావస్తు శాఖ కార్యాలయంలో శనివారం గుత్తి కోట సంరక్షణ సమితి ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను మ్యూజియం ఏడీ రజిత, ఏపీ ఎంఐసీ పీడీ రఘునాథ్‌రెడ్డి, జిల్లా పర్యాటక శాఖ అధికారి జయకుమార్ బాబు ఆవిష్కరించారు. చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ అశోక్, జిల్లా పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ గురుమూర్తి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నరసింహారావు, ఇంటాక్ అధ్యక్షులు రాంకుమార్, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షులు విజయ్ భాస్కర్ తదితరులు జిల్లా పర్యాటక శాఖ విశేషాలపై చర్చించారు. సమితి గౌరవాధ్యక్షులు వెంకటరామిరెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, రియాజుద్దీన్, నబీరసూల్ పాల్గొన్నారు.

**అంగన్‌వాడీల్లో ఈసీసీఈ డే**

**ఆత్మకూరు:** మండలంలోని సనప, బి.యాలేరు, తోపుదుర్తి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ఈసీసీఈ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సంఖ్యాజ్ఞానం, సృజనాత్మకతపై పిల్లలకు అవగాహన కల్పించారు. పిల్లలతో అంకెలతో కూడిన అభినయ గేయాలు, మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు ఎలా కొనాలి? కూరగాయల విక్రయాలను పిల్లలతో చేసి చూపించారు. పిల్లలకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు రాధిక, కళావతి, జహినాబి పాల్గొన్నారు.

**కూటమి ప్రభుత్వంలో దళితులకు రక్షణ కరువు**

**అనంతపురం టవర్‌క్లాక్:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు జరుగుతున్నాయి. దళితులకు రక్షణ లేదని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. హరి మాట్లాడుతూ.. చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గం తడుకు పేట గ్రామంలో దళితులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలన్నారు. ఓబులేసు, శ్రీనివాసులు, దొన తిమ్మప్ప పాల్గొన్నారు.

**ఇంటింటా భగవద్గీత మార్మోగాలి**

**అనంతపురం కల్చరల్:** భగవద్గీతకు ప్రాణం పోసిన ఘంటసాల పాటలు అజరామరమని భగవద్గీత ఫౌండేషన్ చైర్మన్ గంగాధర శాస్త్రి అన్నారు. శనివారం రాత్రి స్థానిక హౌసింగ్ బోర్డులోని ఘంటసాల స్మారక విగ్రహం వద్ద అనంతకు విచ్చేసిన గంగాధర శాస్త్రిని అనంత కళాసంస్థలు ఘనంగా సత్కరించాయి. డీఆర్‌ఓ మలోలా మట్లాడుతూ.. ఘంటసాలకు ప్రతిరూపంగా గంగాధర శాస్త్రి ఆంధ్రులకు సుపరిచితులన్నారు. నాగరాజు, డాక్టర్ జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి, జీవీ రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

**కందిలో పంటకోత ప్రయోగాలు**

**ఆత్మకూరు:** మదిగుబ్బ గ్రామంలో శనివారం కందిలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. 10 మీటర్లు పొడవు, 10 మీటర్లు వెడల్పు విస్తీర్ణంలో కంది పంటను తొలగించి పది రోజులు ఎండబెట్టడం జరుగుతుందని జిల్లా ప్రణాళిక అధికారి అశోక్ కుమార్ తెలిపారు. ఎండిన అనంతరం పంటను తూకం వేయడం జరుగుతుందన్నారు. వచ్చిన పంటను దిగుబడి ఆధారిత బీమాగా పంపిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏఈఓ సుజిత, ఏఎస్‌ఓ మమత పాల్గొన్నారు.

**భూ సమస్యల పరిష్కారానికి చర్యలు**

**రాప్తాడు:** గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విజయకుమారి పేర్కొన్నారు. శనివారం మండలంలోని ప్రసన్నాయపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను గడువులోగా పరిష్కరిస్తామన్నారు. అనంతరం ప్రజలు, రైతుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో సీఎస్‌డీఓ జ్యోతి, సర్వేయర్ రామాంజనేయులు పాల్గొన్నారు.



# పూర్వ విద్యార్థులే బ్రాండ్ అంబాసిడర్లు



సమ్మేళనంలో పాల్గొన్న 1978-80 బ్యాచ్ కామర్స్ పూర్వ విద్యార్థులు

**అనంతపురం:** పూర్వ విద్యార్థులు వర్సిటీకి బ్రాండ్ అంబాసిడర్లు అని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత అన్నారు. శనివారం కామర్స్ విభాగం 1978–80 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఇదే బ్యాచ్‌లో ఎంకాం పూర్తి చేసిన పూర్వ ఐఏఎస్ అధికారి, పత్తిపాడు ఎమ్మెల్యే డాక్టర్ బి.రామాంజనేయులు విశిష్ట అతిథిగా, అప్పటి ప్రొఫెసర్లు నలుగురు హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. మొత్తం 50 మంది అప్పటి విద్యార్థుల్లో 40 మంది ఈ సమ్మేళనంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం మాజీ ఐఏఎస్ అధికారి రామాంజనేయులు మాట్లాడుతూ.. 45 సంవత్సరాల స్మృతులను నెమరువేసుకునే అవకాశం వచ్చినందుకు గర్వంగా ఉందన్నారు. కార్యక్రమానికి కామర్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆంజనేయులు అధ్యక్షత వహించారు. అప్పటి ప్రొఫెసర్లు వేణుగోపాల్ రెడ్డి, నాగరాజా నాయుడు, సీఆర్ రెడ్డి, హంపన్న, ఫణీశ్వరరావును సత్కరించారు.